


## ఎంపీపై దాడి సరైంది కాదు



అందోల్, అక్టోబర్ 30: మెదక్ ఎంపీ, బీఆర్ఎస్ దుబ్బాక ఎమ్మెల్యే అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిపై దాడి సరైంది కాదని స్టేట్ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ మఠం భిక్షపతి అన్నారు. ఎంపీపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్న ఆయన బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభాకర్‌రెడ్డి త్వరగా కోలుకోవాలని ఆయనకు ఆ భగవంతుడు, ప్రజల ఆశీస్సులు ఎప్పుడూ ఉంటాయన్నారు.

## రికార్డులను సక్రమంగా నమోదు చేయాలి

కోహీర్, అక్టోబర్ 30 : అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు అందించే పౌష్టికాహార వివరాలను రికార్డుల్లో సక్రమంగా నమోదు చేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తులసి ఆదేశించారు. సోమవారం మండలంలోని కవేలి అంగన్‌వాడీ కేంద్రంలో ఆయా గ్రామాల అంగన్‌వాడీ టీచర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తులసి మాట్లాడుతూ పాలు, గుడ్ల పంపిణీ వివరాలను తప్పులు లేకుండా నమోదు చేయాలన్నారు. ప్రతిఒక్కరికీ పౌష్టికాహారాన్ని అందించేందుకు కృషి చేయాలని సూచించారు. సమావేశంలో ఆయా గ్రామాల అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## నేడు ఎమ్మెల్యే రాక

మునిపల్లి,అక్టోబర్ 30 : మండలంలోని పలు గ్రామాల్లో అందోల్ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ పర్యటించి ఇంటింటి ప్రచారం నిర్వహించనున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి మంతురి శశికుమార్ తెలిపారు. మండలంలోని పెద్దచెల్మెడ, అంతారం, పెద్దగోపులారం, మల్లికార్జునపల్లి గ్రామాల్లో ఎమ్మెల్యే క్రాంతికిరణ్ ఇంటింటి ప్రచారం నిర్వహించనున్నారని తెలిపారు. కార్యక్రమానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, సర్పంచ్, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

## దళితుల ఆత్మీయ సమ్మేళనానికి తరలిరావాలి

పుల్కల్, అక్టోబర్ 30: దళితుల ఆత్మీయ సమ్మేళనానికి మండలంలోని దళిత సంఘాల నాయకులు భారీగా తరలి రావాలని బీఆర్ఎస్ నాయకులు ఎర్రోళ్ల పోచయ్య అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు ఉదయం 11గంటలకు ఏఎస్ గార్డెన్ బస్వాపూర్ ఫంక్షన్ హాల్‌లో దళితుల ఆత్మీయ సమ్మేళనం ఉంటుందన్నారు. కార్యక్రమంలో భాగంగా ముందుగా మండల కేంద్రంలోని అంబేద్కర్, చాకలి ఐలమ్మ, స్వామి వివేకానంద విగ్రహాలకు పూలమాలలు వేసి అనంతరం అక్కడి నుంచి అందరూ ర్యాలీగా బయలుదేరి ఏఎస్ గార్డెన్‌లో నిర్వహించే దళితుల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొంటారని పోచయ్య తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే క్రాంతికిరణ్ హాజరవుతారన్నారు. ఉమ్మడి మండలంలోని దళిత సం ఘాల నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలన్నారు.

## కురుమల సభను విజయవంతం చేయాలి

రాయికోడ్, అక్టోబర్ 30: రాయికోడ్‌లో నిర్వహించే కురుమల ఆశీర్వాద సభను విజయవంతం చేయాలని అందోల్ మున్సిపల్ చైర్మన్ మల్లయ్య అన్నారు. సోమవారం రాయికోడ్‌లో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. స్థానిక ఎమ్మెల్యే క్రాంతికిరణ్ గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. వచ్చే నెల 3న మండలంలోని నాగ్వార్ గ్రామ శివారులో నియోజకవర్గ కురుమ అశీర్వాద సభకు నియోజకవర్గంలో అన్ని గ్రామాల నుంచి ప్రజలు కురుమలు హాజరు కావాలని కోరారు.

## ఖోఖోలో రాష్ట్ర స్థాయికి ఎంపిక

కల్హేర్, అక్టోబర్ 30: జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో 33వ సబ్ జూనియర్ బాలికల విభాగంలో ఉమ్మడి మెదక్ జిల్లా స్థాయిలో కృష్ణాపూర్ ప్రభుత్వ పాఠశాలకు చెందిన ముగ్గురు క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న జే. వర్ష, ఆర్. సోనా, 9వ తరగతి చదువుతున్న కే. శ్రీలత ఉమ్మడి మెదక్ జిల్లాలో నిర్వహించిన ఖోఖో పోటీలో ఉత్తమ ప్రతిభ కనబర్చారన్నారు. వారికి శిక్షణ ఇస్తున్న పీఈటీ రాములును అభినందించారు. వచ్చే నెల 14న తుప్రాన్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటిల్లో పాల్గొననున్నట్లు తెలిపారు.



రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులు

# దోచుకుని దాచుకోవడమే వారి నైజం

- ఎమ్మెల్యేగా గెలిచి రాష్ట్రస్థాయి పదవులు చేపట్టి ఏ అభివృద్ధి సాధించారు
- దామోదర్‌పై నిప్పులు చెరిగిన ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి క్రాంతికిరణ్

అందోల్, అక్టోబర్ 30: ప్రజలను దోచుకుని దాచుకోవడమే కాంగ్రెస్, నాయకుల నైజం అని ఎమ్మెల్యే, బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చంటి క్రాంతికిరణ్ అన్నారు. సోమవారం మండలంలోని కన్సాన్‌పల్లి, రాంసాన్‌పల్లి, నేరడిగుంట గ్రామాల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో అందోల్ నుంచి ఎమ్మెల్యేలుగా గెలిచి రాష్ట్ర స్థాయిలో ఉన్నత పదవులు చేపట్టిన ప్రజలకు మాత్రం ఎలాంటి న్యాయం చేయలేదని ఆరోపించారు. ఈ వలస నాయకులు కారణంగా అన్ని రంగాల్లో అందోల్ వెనుకబడి పోయిందన్నారు. అందోల్ వెనకబాటును గుర్తించిన సీఎం కేసీఆర్ మొదటి సారి స్థానికుడికే టికెట్ కేటాయించి అందోల్‌ను అభివృద్ధి చేసుకునే బాధ్యతను అప్పగించారని ప్రజలంతా ఏకమై స్థానికుడినైన తనను భారీ



రంసాన్‌పల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి క్రాంతి కిరణ్

మెజార్టీతో గెలిపించారన్నారు. కాంగ్రెస్ నాయకులు రైతులపై సవతితల్లి ప్రేమ చూపుతున్నదని వారి మాటలను నమ్మవద్దని కోరారు. కాంగ్రెస్–బీజేపీలకు ఓట్లువేస్తే ఆగమైతామని రైతులు కండ్ల ముందు కనబడుతున్న అభివృద్ధిని చూసి ఇంటి ముందు కనబడుతున్న స్థానిక బిడ్డకు ఓటు వేసి ఆశీర్వదించాలన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు లక్ష్మీకాంత్ రెడ్డి, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు కృష్ణాగౌడ్, సర్పంచ్ యాదాగౌడ్, నాయకులు పాల్గొన్నారు.

**ఎంపీపై దాడి పిరికిపందల చర్య**

మెదక్ ఎంపీ, దుబ్బాక బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిపై దాడి పిరికిపందుల చర్య అని ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ అన్నారు. సోమవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా గుర్తుతెలియని వ్యక్తి ప్రభాకర్‌రెడ్డిపై దాడి చేయగా ఆయన తీవ్రంగా గాయపడి దవాఖానలో చేరడం బాధాకరమన్నారు.

**ముమ్మరంగా వాహనాల తనిఖీ**

ఎన్నికల నేపథ్యంలో పోలీసులు వాహనాల తనిఖీ ముమ్మరం చేశారు. ప్రధాన రహదారులు, చౌరస్తాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేయడంతో పాటు రహదారులపై ఆకస్మిక తనిఖీలు చేస్తున్నారు. సోమవారం అందోల్ మండలం రంసాన్‌పల్లిలో ఎన్నికల ప్రచారం ముగించుకుని నేరడిగుంటకు వస్తున్న ఎమ్మెల్యే, బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చంటి క్రాంతికిరణ్ వాహనాన్ని స్పెషల్ స్క్వాడ్ పోలీసుల బృందం తనిఖీ చేశారు. ఎమ్మెల్యే తన వాహనం రోడ్డు పక్కన నిలిపి పోలీసులకు సహకరించారు.

# ఎన్నికలు సజావుగా జరిగేలా సహకరించాలి

- అందోల్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి పాండు
- జోగిపేటలో సిబ్బందికి శిక్షణ తరగతులు

అందోల్, అక్టోబర్ 30 : వచ్చే నెల 30న జరుగనున్న శాసన సభ ఎన్నికలు సజావుగా జరిగేలా సహకరించాలని అందోల్–జోగిపేట ఆర్డీవో, ఎన్నికల రిటర్నింగ్ అధికారి పాండు సిబ్బందికి సూచించారు. సోమవారం జోగిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నియోజకవర్గంలోని 6మండలాల పీవో, ఏపీవోలకు (పోలింగ్ అధికారులు, అసిస్టెంట్ పోలింగ్ అధికారులు) శిక్షణ తరగుతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది తప్పనిసరిగా శిక్షణ తరగతులకు హాజరుకావాలన్నారు. ఎన్నికల విధులు నిర్వహించడం తప్పనిసరి అని ఎవరైనా గైర్హాజరైతే చర్యలు తీసుకుంటామన్నారు. ఈవీఎంలపై, వీవీప్యాట్‌లపై తగిన అవగాహన కలిగి ఉండాలని పోలిం గ్ సమయంలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని విషయాలపై తగిన శిక్షణ అవసరమన్నారు. రెండు రోజులపాటు ఈ శిక్షణ ఉంటుందని ఎవరికైనా ఇంకా ఏమైనా సందేహాలుంటే ఆర్వో



అందోల్ : జోగిపేట శిక్షణతరగతుల్లో మాట్లాడుతున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి పాండు

కార్యాలయంలో సంప్రదించాలన్నారు. ఎన్నికల నియ మ.. నిబంధనల ప్రకారం అందరూ పనిచేయాలని సూచించారు. ఎన్నికలు ముగిసే వరకు ఈసీ ఆధినంలోనే వారి ఆదేశాల ప్రకా రం నడుచుకోవాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ అంటోని, డీటీ మధుకర్‌రెడ్డి, ఎంపీడీవో సత్యనారాయణ, ఎంఈవో కృష్ణ పాల్గొన్నారు.

## కేసీఆర్ వెంటే ప్రజలు

రాయికోడ్,అక్టోబర్ 30 : ప్రజలను మోసం చేయడంలో కాంగ్రెస్‌ను మించిన మరొక పార్టీ లేదని ఎంపీపీ మమతాఅశోక్‌కుమార్, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు బస్వరాజుపాటిల్ అన్నా రు. సోమవారం మండలంలోని కోడూర్, హస్నాబాద్, ఔరంగనగర్ గ్రామాల్లో ఎమ్మెల్యే క్రాంతికిరణ్‌కు మద్దతుగా ఇంటింటికీ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం 60ఏండ్లు అధికారంలో ఉన్నప్పుడు చేయని అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఇప్పుడు ఇవ్వడం ఎలా సాధ్యమవుతుందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అందిస్తున్న అనేక సంక్షేమ పథకాలు గ్రామాల్లో గడపగడపకు అందుతున్నాయన్నారు. గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు ఆరు గ్యారెంటీలు అనే ముసుగు వేసుకొని ఓట్లు అడిగేందుకు వస్తున్నారన్నారు. కాంగ్రెస్ నాయకుల మాయ మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ కార్యదర్శి నాజింపాటిల్, సర్పంచ్ కృష్ణ, హనుమంతు, నాగార్జున, మండల బీఆర్ఎస్ కార్యదర్శి శంకర్ ఉన్నారు.

# క్రాంతికిరణ్ హయాంలోనే అభివృద్ధి



వట్‌పల్లి : కేరూర్‌లో ఇంటింటి ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

వట్‌పల్లి, అక్టోబర్ 30 : అందోల్ బీఆర్ఎస్ అభ్యర్థి ఈ ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలుపొందుతారని వరం అధ్యక్షుడు వీరారెడ్డి, రైతుబంధు అధ్యక్షుడు అశోక్ గౌడ్, ప్రధాన కార్యదర్శి శివాజీరావు అన్నారు. సోమవారం మండలంలోని కేరూర్, బీజిలీపూర్, బుడ్డాయిపల్లి, సాయిపేట గ్రామాల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. గడప గడపకు వెళ్లి ఓటర్లకు బీఆర్ఎస్ ప్రభుత్వం, సీఎం కేసీఆర్ అందించిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. వీటితో పాటు ఎన్నికల మ్యానిఫెస్టోపై అవగాహన కల్పించారు. ఎన్నికల్లో స్థానిక ఎమ్మెల్యే అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. స్థానిక పాలనలో జరిగిన అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని ఓటు వేయాలన్నారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తూ తప్పుదొవా పట్టిస్తున్నారని వారి మాటలు నమ్మొద్దొని ఓటర్లకు సూచించారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.



నిజాంపేట నుంచి ఖేడ్‌కు వెళ్తున్న గులాబీ నాయకులు

## సీఎం సభకు తరలి వెళ్లిన పార్టీ శ్రేణులు

నిజాంపేట, అక్టోబర్ 30 : మండలం నుంచి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పెద్ద ఎత్తున సీఎం కేసీఆర్ సభకు నారాయణఖేడ్‌కు తరలి వెళ్లారు.

**సిర్గాపూర్ మండలం నుంచి..**

సిర్గాపూర్, అక్టోబర్ 30: మండలంలోని అన్ని గ్రామాల నుంచి నారాయణఖేడ్‌లోని సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభకు పెద్ద సంఖ్యాతో తరలివెళ్లారు.

## యువకుడిపై కత్తులతో దాడి

హత్నూర, అక్టోబర్ 30: ఇంట్లో నిద్రిస్తున్న యువకుడిపై కత్తులతో దాడిచేసిన ఘటన హత్నూర మండలం నస్తీపూర్‌లో సోమవారం తెల్లవారుజామున చోటు చేసుకున్నది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నస్తీపూర్ గ్రామానికి చెందిన నీరుడి అనిల్, రామచంద్రాపురం మండలం స్టేషన్ నాగులపల్లి గ్రామానికి చెందిన అశ్వినిని (అనిల్ దగ్గర బంధువు)లు నెలరోజుల క్రితం ఇరు కుటుంబాలకు తెలియకుండా ప్రేమవివాహం చేసుకున్నాడు. అనంతరం పోలీసులను ఆశ్రయించడంతో ఇరు కుటుంబీకులకు కౌన్సెలింగ్ ఇచ్చి నచ్చుజెప్పారు. అప్పటి నుంచి నస్తీపూర్‌లోని అనిల్ ఇంట్లో నూతన దంపతులు ఉంటున్నారు. కాగా వచ్చెనెల 5న పెద్దల సమక్షం లో పెళ్లి జరిపించేందుకు అబ్బాయి కుటుంబీకులు ముహూర్తం నిర్ణయించి పెళ్లికార్డులు కొట్టించారు. విషయం తెలుసుకున్న అమ్మాయి కుటుంబీకులు, బంధువులు సోమవారం తెల్లవారుజామున నస్తీపూర్‌కు చేరుకొని నిద్రిస్తున్న దంపతులపై దాడి చేసి అశ్వినిని బలవంతంగా తీసుకెళ్తుండగా అడ్డుకునేందుకు ప్రయత్నించిన అనిల్‌పై కత్తులతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. కారులో అశ్వినిని తీసుకెళ్తుండగా స్థానికులు కొందరిని పట్టుకొని దేహశుద్ధిచేసి పోలీసులకు అప్పగించారు. విష యం తెలుసుకున్న పోలీసులు తీవ్రంగా గాయపడిన అనిల్‌ను చికిత్స నిమిత్తంసంగారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అనిల్ తండ్రి లక్ష్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ వేణుకుమార్ తెలిపారు.